నిశ్చలంగా ఉండటం నేర్చుకోవాలి. నువ్వు పని చేసేటప్పుడు నీ మనస్సు అక్కడే ఉండాలి. మీ చేతిలో ఉన్న పని పెర్ఫెక్ట్‌గా చెయ్యండి, పనిని మటుకు అశ్రద్ధ చెయ్యవద్దు, పని దగ్గర బద్ధకస్థులుగా ఉండవద్దు, మీరు పని దొంగలు అవ్వవద్దు. భగవద్గీతలో చెప్పిన కర్మయోగం మనం ఆచరించటం లేదు.

మీ ఇంట్లో మీరు ఎలా ఉంటున్నారో అంత నేచురల్‌గా, అంత నార్మల్‌గా మీ మనస్సు పరమాత్మయందు స్థిరపడి ఉండాలి. మీ ఇంటి దగ్గర మీరు ఎలా ఉండాలంటే అలా ఉంటారు, నార్మల్‌గా, నేచురల్‌గా ఉంటారు. కానీ చుట్టాలింటికి వెళితే ఎబ్‌నార్మల్‌గా ఉంటారు. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే మీ ఇంటి దగ్గర మీరు ఎంత సహజంగా ఉంటారో అలా మనస్సు ఆత్మలో సహజంగా ఉండటానికి ముందు ప్రయత్నం చెయ్యాలి, తరువాత ఎఫర్ట్‌లెస్‌గా మీ మనస్సు పరమాత్మయందు స్థిరంగా ఉంటుంది అప్పుడు సులభంగా మీరు పరమాత్మలో ఐక్యమవ్వవచ్చు. నువ్వు పరమాత్మలో స్థిరంగా ఉంటే పరమాత్మ స్వరూపం పొందుతావు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-03-2013, అర్తమూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తులలో ప్రహ్లాదుడు అగ్రగణ్యుడు అని చెపుతారు. తండ్రి ఎన్ని హింసలు పెట్టినా తండ్రి మీద ఆయనకు వైరభావన కలుగలేదు, ద్వేషబుద్ధి కలుగలేదు, తండ్రి క్షేమం కోరుతూనే ఉన్నాడు, వాడు ప్రహ్లాదుడు. అందుచేత భక్తులలో ప్రహ్లాదుడికి అగ్రస్థానం ఇచ్చారు. చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను అని ప్రహ్లాదుడు చెపుతాడు. ఓ తండ్రీ! నాకు అన్ని విద్యలు తెలుసును అని అంటున్నావు, హృదయంలోనికి వెళ్ళే విద్యను నేర్చుకొన్నావా? ఎక్కడైతే పరమేశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడో ఆ హృదయంలోనికి వెళ్ళటం నేర్చుకొన్నావా తండ్రీ అని ప్రహ్లాదుడు అడుగుతాడు. తనపై తండ్రి హిరణ్యకశిపుడు ఎంత వైరభావం పెట్టుకొన్నప్పటికీ, ఆయన బాగుపడాలి అని చెపుతున్నాడు. అంతేగాని ప్రహ్లాదుడికి ఎక్కడా ద్వేషభావన లేదు.

కర్మమార్గం, భక్తిమార్గం, జ్ఞానమార్గం ఈ మూడు మార్గాల గురించి భగవద్గీతలో పరమాత్మ వివరంగా చెప్పాడు. భగవంతుని పాదాల దగ్గరకు చేరటానికి కర్మమార్గం, జ్ఞానమార్గం, భక్తిమార్గం ఇలా చాలా మార్గాలు ఉన్నాయి కాని ఈ కలియుగానికి భక్తిమార్గం

మంచిది అని నారదమహర్షి చెప్పాడు. శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యులు మనకు ముగ్గురు ఆచార్యులు ఉన్నారు. మీరు శంకరుడి గురించి, రామానుజుడు గురించి వింటున్నారు కాని మధ్వాచార్యుల గురించి ఈ ప్రాంతంలో ప్రచారం తక్కువ. మధ్వాచార్యులకు శివద్వేషం లేదు అయితే మహావిష్ణువే సుప్రీమ్ తరువాతే మిగతా దేవతలు అందరూ అని చెపుతాడు. రామానుజ మతస్థులు అందరూ రామాయణాన్ని ఎంతగా ప్రచారం చేసారో అలాగే మధ్వాచార్య మతస్థులందరూ భాగవతాన్ని అంతగా ప్రచారం చేసారు. శంకరాచార్యుడిది అద్వైతం, భగవద్గీత, ప్రస్థానత్రయం వారు ప్రచారం చేసారు. కర్ణాటకలో ధర్మస్థలిని స్థాపించినవారు మధ్వాచార్య సాంప్రదాయం వారు. అక్కడ శివుడిపేరు మంజునాథుడు, అక్కడ అర్చన చేసేవారు వైష్ణవులు.

**మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః సంగవర్జితః**
**నిర్వైరః సర్వభూతేషు యస్సమామేతి పాండవ**

ఈ శ్లోకం మోక్షాన్ని సాధించిపెట్టేది అని శంకరాచార్యులవారు పొంగిపోయి వ్యాఖ్యానం వ్రాసారు. మత్కర్మకృత్ అంటే నా కొరకు కర్మలను ఆచరించు అంటే మనిషి పుట్టింది మొదలు చనిపోయేవరకు ఏదో కర్మచేస్తూనే ఉంటాడు. శరీరం వచ్చింది కాబట్టి ఆ శరీరపోషణకు తగిన పనులు చేసుకొంటూ, నాకు ప్రీతి కలిగించే పనులు నా అనుగ్రహం పొందేపనులు చేస్తూ ఉండు అని పరమాత్మ చెపుతున్నాడు. వైకుంఠానికి వెళితే మోక్షం అని కొంతమంది, కైలాసానికి వెళితే మోక్షం అని కొంతమంది అనుకొంటున్నారు కాని మన హృదయంలో ఉన్న పరమాత్మ సాక్షాత్కారమే మోక్షం, పరమాత్మానుభవం పొందటమే మోక్షం. మనందరకు ఎంతసేపు ఏదో ఒక విషయచింతన తప్ప, మన హృదయంలో అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు అనే విశ్వాసం మనకు లేదు. మనం విశ్వాసహీనులం. మన హృదయంలో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. ఆయన నూటికి నూరుపాళ్ళు సత్యం. మిగతావి అన్నీ కూడా మన మనస్సు ఎంత నిజమో అవి అన్నీ కూడా అంతే నిజం.

ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. హృదయంలో ఉన్న ఈశ్వరుడి యొక్క ప్రసాదంలో ఎవడయితే ఉయ్యాల ఊగుతున్నాడో, ఎవడైతే ఆయన అనుగ్రహంలో ఉన్నాడో, ఇంద్రియాలు, మనస్సు, శరీరం యొక్క వలయంలో కాకుండా ఈశ్వరుడియొక్క వలయంలో ఎవడైతే ఉన్నాడో ఎవడైతే నిరంతరము ఆయన చింతనలో ఉన్నాడో, ఆయన ప్రసాదాన్ని ఎవడైతే పొందుతున్నాడో వాడికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది, వాడు మాత్రమే మోక్షాన్ని పొందుతాడు.

అటువంటి స్థితి మీకు కూడా అనుగ్రహించమని భగవంతుడిని కోరుకొంటున్నాము. ఇవి కాలక్షేపం మీటింగులు అనుకోవద్దు. ఈశ్వరప్రసాదం మీకు కూడా దొరకాలని మేము కోరుకొంటున్నాము. మా మనస్సు మంచిది కాదండి, మేము మంచి వాళ్ళం కాదండి, మేము చెడ్డవాళ్ళమండి అని ఇటువంటి మాటలు మీరు ఎప్పుడూ అనుకోవద్దు. ఒకవేళ మీ మనస్సులో ఏమయినా పాడుగుణాలు ఉన్నా ఈశ్వరుని దయ ఉంటే కొన్ని క్షణాలలో మీలో ఉన్న పాడుగుణాలను తీసేసి మిమ్మల్ని మంచిగుణాలతో అలంకరిస్తాడు. ఈశ్వరుని ప్రసాదం మీకు దొరికితే మీ చెడ్డ మనస్సు కొన్ని క్షణాలలో మంచి మనస్సుకింద మారిపోతుంది. ఆచార్యులవారు ఏమన్నారంటే ఒక వెయ్యి సంవత్సరాలనుండి చీకటిగా ఉన్న గదిలో అయినా దీపం వెలిగిస్తే ఏమవుతుంది వెంటనే వెలుతురు వచ్చేస్తుంది. నేను వెయ్యిసంవత్సరాల నుండి ఉన్నాను, నేను వెళ్ళను అని చీకటి అంటుందా? దీపం వెలిగించిన వెంటనే చీకటి పోతుంది, వెలుతురు వచ్చేస్తుంది. గడ్డిమేటు ఎంత పెద్దది అయినా ఒక్క అగ్గిపుల్ల వేస్తే బూడిద అయిపోతుంది. అలాగే గడ్డిమేటు అంత దోషాలు మీ మనస్సులో ఉన్నా ఈశ్వరప్రసాదం అనే అగ్ని అంటుకుంటే కొన్ని క్షణాలలో ఆ దోషాలు అన్నీ కూడా కాలి బూడిద అయిపోతాయి. ఎవడికైతే ఈశ్వరప్రసాదం దొరికిందో వాడికి ఆత్మానుభవం కలుగుతుంది. అందుచేత మీ జీవిత విధానం ఎలా ఉంటే మీకు ఈశ్వరప్రసాదం దొరుకుతుందో అలాగ మీ జీవితాన్ని తీర్చిదిద్దుకోవలసిన అవసరం మీకు ఉంది.

మత్కర్మకృత్ అంటే నా అనుగ్రహం పొందటానికి అనుగుణమైన పనులు చెయ్యండి. అంటే నీ మాట, చేత, తలంపులు అన్నీకూడా ఈశ్వరప్రసాదం పొందటానికి అనుగుణంగా ఉండాలి. లెట్ నోబుల్ తాట్స్ కమ్ టు అజ్ ఫ్రమ్ ఎవ్విరిసైడ్ అని ఋగ్వేదంలో ఒకమాట ఉంది. అంటే ఏమూలలోనుండి చూసినా, ఏ కోణంలోనుండి చూసినా నాకు మంచి తలంపులు, బాగుపడే తలంపులు, ఈశ్వరుని పాదాల దగ్గరకు తీసుకొని పోయే తలంపులు వచ్చేటట్లు అనుగ్రహించు అని ప్రార్థించటం. మత్పరమః అంటే మీరు ఏపని చేసినా, ఏమాట మాట్లాడినా నన్ను పొందటమే ప్రయోజనంగా పెట్టుకోవాలి అని పరమాత్మ చెపుతున్నాడు. మనుషులు రకరకాలుగా ఉంటారు అంటే గుణాలు రకరకాలుగా ఉంటాయి. ఆ గుణాలను బట్టి కర్మలు చేస్తారు. మనస్సు ఎంత నిజమో, శరీరం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో గుణకర్మలు కూడా అంతే నిజం. అందుచేత ఆ గుణాల జోలికి, కర్మల జోలికి మనం వెళ్ళకూడదు. ఈశ్వరుడినే గమ్యంగా పెట్టుకొని, మనం పొందవలసిన వాడు ఈశ్వరుడే

అనే విషయం మర్చిపోకుండా పనిచేయండి. నాయందు శ్రద్ధ కలిగి ఉండండి, నాపట్ల భక్తి కలిగి ఉండండి, నన్నే ఉపాసన చేయండి అంటే భక్తిలేని వారికి భక్తి కలుగచేయటం కోసం పరమాత్మ ఈ మాటలు చెపుతున్నాడు. అందరూ భగవంతుడి పిల్లలే కదా అందుచేత ఆయన ఒక వాక్యం చెపితే అందరినీ ఉద్దేశించి చెపుతాడు. మనం ఏ మార్గంలో ఉన్నా ఆయన చెప్పేమాటలు అందరికీ వర్తిస్తాయి. భగవంతుడు అందరినీ దృష్టిలో పెట్టుకొని, అందరి బాగు కోరి చెపుతాడు కాని ఎవరో కొంతమందిని దృష్టిలో పెట్టుకొని చెప్పడు. ఈ జీవకోటి ఎలా ఉన్నప్పటికీ, వారు ఏ గుణాలతో ఉన్నప్పటికీ అందరిని కూడా బాగుచేయాలనే ఆయన ఉద్దేశ్యం. మనలను బాగుచేయటానికే అవతారం ధరించి వస్తారు. అవతార పురుషులకు సొంత పనులు ఏమీ ఉండవు.

ప్రహ్లాదుడు తండ్రితో అంటాడు ఓ తండ్రీ నీ హృదయంలో గంగ ఉంది. ఆ గంగను తాగటం మానేసి ఎండమావులలో నీరు తాగుదామని పరిగెడుతున్నావా? ఎండమావులలో నీరు ఉన్నట్లు కనిపిస్తుంది కాని అక్కడ నీరు ఉండదు. అలాగే నువ్వు ఇంద్రియాలతోటి, మనస్సుతోటి అనుభవించే భోగాలలో సుఖం లేదు, శాంతిలేదు. వాటిలోనుండి సుఖం వస్తుందని, శాంతి వస్తుందని వాటి వెంట పరుగెడుతున్నావు. రాచరికం చేసి నువ్వు అనుభవించే భోగాలు కూడా అటువంటివే. నిజమైన శాంతి, సుఖం నీ హృదయంలో ఉంది. దానిని పొందటం మానేసి ఎక్కడో సుఖం, శాంతి ఉందని వాటికోసం బయట వెదుకుచున్నావు. అక్కడ ఉంటే కదా నీకు దొరకటానికి. రామరావణ యుద్ధ సమయంలో విభీషణుడు అన్న రావణాసురుడిని వదిలేసాడు. ధర్మంకోసం దుర్మార్గుడిని వదిలేయటం మంచిది అనుకొని అన్నగారిని వదిలేసాడు. కాని కుంభకర్ణుడు అలా చేయలేదు. నువ్వు చేసేది తప్పుఅని అన్నగారికి చెప్పాడు. రావణాసురుడితో నువ్వు దొంగచాటుగా సీతను ఎత్తుకు వచ్చావు. నువ్వు పిరికివాడవు అని ఆమెకు అర్థమయ్యింది. నీలాంటి పిరికివాడిని సీత ఎలా ప్రేమిస్తుంది. నువ్వు లంకకు రాజువు. నువ్వు ఒక్కడివే పాడయిపోయినా ఫరవాలేదు లంకనంతా పాడుచేస్తున్నావు అని చెప్పవలసినదంతా చెప్పి, అయినా సరే నువ్వూ నేను ఒకే తల్లి కడుపున పుట్టాము కాబట్టి నువ్వు చెడ్డ చేస్తున్నా నీ తరుపునే యుద్ధంచేస్తాను. నువ్వు ఎలాగూ చనిపోతావు, నీతోపాటు నేను కూడా చనిపోతాను అంటాడు కుంభకర్ణుడు. అదీ సోదరప్రేమ.

శ్రద్ధావాన్‌లభతే జ్ఞానం. శ్రద్ధ వలన జ్ఞానం కలుగుతుంది. శ్రద్ధ అనేది విడిచిపెట్టకండి.

ఏదోరోజున మీరు ఈశ్వర ప్రసాదాన్ని పొందుతారు. ఈ నాటికి కాకపోయినా ముందు నాటికి అయినా మీరు అందరూ ఈశ్వర ప్రసాదాన్ని పొందుతారు. ఈ మాటను గుర్తు పెట్టుకోండి. ఈశ్వరుడు కాలరూపంలో ఉన్నాడు. మీ అందరి మీద ఆయన దయ చూపిస్తాడు, మీకు ఆత్మశాంతి కలుగుతుంది. ఆత్మశాంతి అంటే మీకు ఇంటిదగ్గర అనుకూలమైన సంఘటనలు జరిగినప్పుడు వచ్చే శాంతి అనుకోకండి. అది అలౌకికం, అభౌతికం. అసలు మీకు శాంతిస్థానం దొరికితే మీరు సుఖి అవుతారు. మీరు సుఖి అయిన తరువాత ఈ దేహం ఉంటే ఎవడికి కావాలి, దేహం లేకపోతే ఎవడికి కావాలి, ఈ లోకం కనిపిస్తే ఎవడికి కావాలి, లోకం కనిపించకపోతే ఎవడికి కావాలి. ఇవి ఏమీ నిజం కాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. ఈ రోజు మేము ఇక్కడకు వచ్చినప్పుడు కింద బట్టలు వేసి, వాటిమీద పూలువేసి మమ్మల్ని నడిపించారు. మాకు సంబంధించినంత వరకూ యివి ఏమీ అక్కరలేదు. నేనూ మీలాంటివాడినే. మీ కుటుంబసభ్యుడిగా మమ్మల్ని గౌరవించండి, సరిపోతుంది. ఇలా బట్టలు, పుష్పాలు, భజంత్రీలు ఇవన్నీ అక్కరలేదు.

నాకు ఒక డాక్టరుగారు ఫోన్ చేస్తూ ఉంటారు. ఆవిడకు కూతుళ్లు అన్నా, మనవలు అన్నా చాలా ఇష్టం. 24గంటలు ఆవిడ మనస్సు వారి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. నాన్నగారు మీరు నాకు భక్తిని ప్రసాదించండి అని అడుగుతారు. అసలు ఆవిడ మనస్సును, బుద్ధిని ఎప్పుడైనా భగవంతుడికి యిస్తేకదా. మనస్సులో పది పైసలువాటా అయినా భగవంతుడికి ఇవ్వాలికదా, రూపాయికి రూపాయి కూతుళ్లకు, మనవలకు ఇచ్చేస్తే ఇంక భగవంతుడికి చోటు ఎక్కడ ఉంది. ఎంతసేపు వారి యోగక్షేమాల గురించి ఆలోచిస్తూ ఉంటే ఇంక భగవంతుడు ఎలా గుర్తుకు వస్తాడు. ఆవిడ అస్తమానూ వారి గురించి ఆలోచించటం వలన వారు పెద్దవాళ్ళు అయిపోతారా? సత్రంలోనికి జనం వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. అటువంటి సత్రమా మన హృదయం. అక్కడ భగవంతుడికి కొంచెం అయినా చోటు ఉండాలికదా. మనకు ఎంతసేపు లోకం గొడవలు, కుటుంబ గొడవలు. సత్సంగాలలో కూడా ఏదో పావుగంట భగవంతుడి గురించి చెప్పకోవటం, మిగతాదంతా లోకం గొడవలు. అంటే సత్సంగాలు పెట్టి మీరు భగవంతుడికి దగ్గరవుతున్నారా లేక లోకానికి దగ్గరవుతున్నారా? ఎంతసేపు మీ పిల్లల గురించి ఆలోచిస్తూ ఉంటే వారు గొప్పవారు అయిపోతారా? మీరు భగవంతుడి గురించి ఆలోచిస్తూ ఉంటేనే వారికి ఎక్కువ మేలు జరుగుతుంది.

సంఘవర్జితః అంటే ఆసక్తిదోషం తగ్గించుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. ఏదైనా చిన్నమంచిపని చెయ్యటం, దాని ఫలితం ఎప్పడు వస్తుందా అని కనిపెట్టుకొని ఉండటం. రావిచెట్టు చుట్టూ తిరగటం ఫలితం ఎప్పడు వస్తుందా అని ఎదురుచూడటం. ఇవా మీరు చేసే పనులు. కర్మఫలం పట్ల ఆసక్తి పెట్టుకోవద్దు, లోకవిషయాలపట్ల ఆసక్తి తగ్గించుకోండి. కుటుంబసభ్యుల పట్ల మీ డ్యూటీ ఏదో మీరు చెయ్యండి అంతేగాని 24గంటలూ వారినే మొయ్యవద్దు. నిరంతరం వారినే చింతిస్తూ ఉంటే ఇంక భగవండిని ఎప్పడు స్మరిస్తారు? పరమేశ్వరుడి చింతన కొంతైనా ఉండాలి కదా. మన మనస్సులో భగవంతుడికి స్థానం ఇవ్వాలి. మనం కూడా అందరిలాగే ఉన్నట్లు నటించాలి. మనకు ఉన్న భక్తిగాని, వివేకం గాని, విచక్షణాజ్ఞానం కానీ యితరులకు తెలియనివ్వకూడదు. ఎవరినీ చూసి ద్వేషపడవద్దు. ఎవరైనా ఒకవ్యక్తి అభివృద్ధిలోనికి వస్తే వాడు రాత్రిపగలు ఎంత కష్టపడితే అభివృద్ధిలోనికి వచ్చాడో మనకు తెలియదు. అది మనకు తెలియక వారిని చూసి అసూయపడతాము. అందుచేత ఎవరిని చూసి అసూయ పడవద్దు. అర్జునా! నీవు అనసూయుడవు. అసూయ ఎలా ఉంటుందో నీకు తెలియదు. ఆ ఒక్క మంచి గుణానికి పరమాత్మ అయిన నేను, నీకు లొంగిపోయి భగవద్గీతను ఉపదేశిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు.

క్షుద్రం హృదయదౌర్బల్యం. ప్రతీదానికి నీ హృదయంలో పిరికితనం వస్తే అది నీచమైనది. ఈ భీష్ముడు, ద్రోణుడు ఇంకా కౌరవ సైన్యంలో ఉన్న వీరులను చూసి వీళ్ళందరినీ ఎలా చంపటం అని నీకు తెలియకుండా నీ హృదయంలో దౌర్బల్యం వస్తోంది. అర్జునా! హృదయదౌర్బల్యం చాలా ప్రమాదమైనది, హృదయంలో పిరికితనం పొందటంకంటే నీచమైనది ఏదీలేదు. హృదయదౌర్బల్యం వచ్చినప్పడు మనం ఏమి చేస్తున్నామో మనకు తెలియదు. నీకు ఎవరిని చూసి హృదయ దౌర్బల్యం వస్తోందో వాళ్ళందరినీ ఇప్పటికే నేను చంపి ఉంచాను. ఊరికే నువ్వు చేతులు ఆడించు. నేను చంపాను అని ప్రపంచానికి తెలియదు కదా. అర్జునుడు చంపాడు, అర్జునుడు గొప్ప వీరుడు అని ప్రపంచం చెప్పకొంటుంది. పని నాది, గౌరవం నీది అని పరమాత్మ చెప్పాడు. మీరు ఏమైనా ఘనకార్యాలు సాధిస్తే, నేను ఏమైనా ఘనకార్యాలు సాధిస్తే అవి అన్నీ కూడా ఈశ్వరుడు చేసిన పనులే. ఒకవేళ మీరు ఏదైనా మంచిపనులు చేస్తే ఈశ్వరుడు మీకు ఆ శక్తి ఇచ్చి చేయించాడు. పనిచేసింది ఈశ్వరుడు, గౌరవాలు ఊరేగింపులు మనకి. పరమేశ్వరుడు చేసిన పని మీ కళ్ళకు కనబడదు, మీ చెవులకు వినబడదు. పోనీ మీ బుద్ధికి అర్థం చేసుకొనే

శక్తి ఉందా అంటే లేదు, మీరు కించజ్జులు. చివరకు మేమే చేసాము అనుకొంటున్నారు అక్కడ నుండి పొగరుబోతుతనం వస్తోంది. పరమేశ్వరుడు అనేవాడు ఉన్నాడు, ఆయన సాధించిపెట్టిందే మనం సాధించాము అనే గుర్తు అసలు మీకు లేదు. హృదయాన్ని సత్తరువులా చేసుకొనేవారికి పరమేశ్వరుడు ఏమి గుర్తుకు వస్తాడు, అసలు మీరు వాడికి చోటు ఇవ్వరుకదా. ఎంతసేపు మీకు లోకవిచారణ, కుటుంబవిచారణ సరిపోతుంది. భగవంతుడి గొడవ అసలు మీకు లేదు.

నిర్వైరః సర్వభూతేషు. ఎవరితోటి విరోధం పెట్టుకోవద్దు. మనుషులు రకరకాలుగా ఉంటారు. వారి గుణాలు మంచివికాదు, వారి కర్మలు మంచివికాదు అంటే వారికి దూరంగా ఉండండి. అంతేగాని ఎవరితోటి విరోధం వద్దు. ఎందుచేతనంటే ఎవరితోటి అయితే విరోధం పెట్టుకొన్నారో చనిపోయేటప్పుడు వారే మనకు గుర్తుకు వస్తారు. కాని సత్పురుషులు మనకు గుర్తుకురారు. ఈమధ్య నేను ఒక పేషెంట్‌ను చూడటానికి వెళ్ళి నిన్ను చూడటానికి వారు వచ్చారా, వీరు వచ్చారా అని అడుగుతున్నాను. ఆ పేషెంట్ ఏమి చెప్పారు అంటే నాన్నగారు నన్ను చూడటానికి వచ్చినవారిని మరిచిపోయి, చూడటానికి రానివాళ్ళ గురించి ఆలోచించమంటారా అని అడిగారు. చూడటానికి వచ్చినవారిని ప్రేమించటం మానేసి, చూడటానికి రాని వాళ్ళ గురించి ఆలోచిస్తూ వారి మీద విరోధం పెంచుకోమంటారా? మన క్షేమంకోరేవాళ్ళని వదిలేసి, మన క్షేమం కోరనివాళ్ళ గొడవ మనకు ఎందుకు? వారిని తలపెట్టుకోవటం వలన వైరభావన వస్తుంది. వారితో మనకు స్నేహం వద్దు, విరోధం వద్దు, మనం న్యూట్రల్‌గా ఉంటే సరిపోతుంది. ఎవరిపట్ల వైరభావన వద్దు అని చెప్పారు. ఎంత బాగా చెప్పారో చూడండి. ఎవరైనా ప్రమాదమైన మనుషులు అని మనం గుర్తించినప్పుడు వారి వలలో మనం పడకూడదు, వారితో విరోధాలు పెట్టుకోకూడదు. మనుషులు వారిలో ఉన్న గుణాలనుబట్టి రకరకాలుగా ఉంటారు, వారి గుణాలను బట్టి కర్మలు చేస్తారు. లోపల పరమాత్మ ఒక్కటే. నువ్వు ఆ మనుషులను చూడవద్దు, వారి గుణాలను చూడవద్దు, వారు చేసే కర్మలను చూడవద్దు, లోపల ఉన్న పరమాత్మను చూడటం నేర్చుకో.

ప్రహ్లాదుడిలో భయం ఎక్కడా మనకు కనబడదు. ఏంటిరా నన్ను చూచి సూర్యుడు భయపడతాడు, చంద్రుడు భయపడతాడు, నన్ను చూసి ఇంద్రుడు పారిపోతున్నాడు నువ్వు జానెడంతలేవు, అంతనిర్భయంగా మాట్లాడుతున్నావు ఏమిటి డింభకా అంటాడు హిరణ్యకశిపుడు. లోపల వాడికి భగవంతుడు ఇచ్చిన శక్తి అని హిరణ్యకశిపుడికి తెలియటం

లేదు. ఓ తండ్రీ! నీకు ఇంద్రియాలు ఉన్నాయి, ఇంద్రియాలు తీసుకొని వచ్చే వికారాలను ఎప్పడైనా పరిశీలించుకొంటున్నావా? అది వదిలేసి వాడిని చంపేస్తాను, వీడిని పొడిచేస్తాను అంటావు ఏమిటి? పోనీ నిన్ను చూసి ఇంద్రుడు పారిపోతున్నాడు. నీకు ఇంద్రియాలలోనుండి వికారాలు వస్తున్నాయి. నిన్ను చూసి ఇంద్రుడు పారిపోతేమటుకు, నీకు వికారాలు వస్తూ ఉంటే నువ్వు పాడైపోతావు కదా! ఇంద్రుడు పారిపోతే నీకు కలిసి వచ్చేది ఏమిటి? నువ్వు బాగుపడేవిధానం చూసుకోవాలి కదా! ఆ వికారాలను తొలగించుకోవటం మానేసి ఇంద్రుడు పారిపోతాడు, చంద్రుడు జడిసిపోతాడు అంటావు ఎందుకు వచ్చిన మాటలు అయ్యా అంటాడు ప్రహ్లాదుడు. నన్ను చూసి అందరూ జడిసిపోతారు, వీడు ఏమిటి పిల్లవాడు, భయపడడు ఏమిటి అని హిరణ్యకశిపుడు ఆశ్చర్యపోతాడు. హిరణ్యకశిపుడిలాగ అనుకొనే గృహస్థులు కూడా ఉంటారు. నా పేరు చెపితే అందరూ హడలిపోతారు అంటారు. ఇంటి గుమ్మంలోనికి రాగానే కావాలని దగ్గుతారు. అంతా సైలెన్స్ అయిపోవాలి. వారు అనుకొన్నట్లు వడ్డించకపోతే పెళ్ళాం వంక శపించేటట్లు చూస్తారు. వాళ్ళ మొఖాలకు శపించే శక్తి ఎక్కడ ఉంది? నేను చెప్పానని మీరు నమ్మవద్దు. మీకూ అనుభవాలు ఉంటాయి కదా! కాని గౌరవం కోసం పైకి చెప్పరు. ఇవన్నీ తింగరపనులు కాకపోతే ఏమిటి?

బాగా సంపాదించిన వారికికూడా కొంచెం గర్వం ఉంటుంది. మేము కష్టపడి ఇంత సంపాదించాము, వీళ్ళందరూ బానిసలుగాపడిఉండాలి, కాని ఇంత నిర్లక్ష్యంగా ఉంటున్నారు ఏమిటి అంటారు. అంటేవారి గర్వానికి మీరు కొంచెంమేత పెడుతూ ఉండాలి. ఇవన్నీ వికారాలు. ఈ వికారాల వెనకాల, గుణాల వెనకాల, గుణాల నుండి వచ్చే కర్మల వెనకాల మీరు తిరగకండి. అటువంటి జనాన్ని వదిలేసి మీ పద్ధతిలో మీరు ఉండండి అంతేగాని వారితో విరోధంవద్దు. మత్కర్మః, మత్పరమః, మద్భక్తిః, సంఘవర్జితః, నిర్వైరః సర్వభూతేషు ఇలా ఉన్నవాడు మాత్రమే ఓపాండవా నన్ను పొందగలడు అని పరమాత్మ చెపుతున్నాడు. వాడు పొందగలడు అని చెప్పటంలేదు, వాడుమాత్రమే నన్ను పొందగలడు అంటున్నాడు. మనం పైకి డాబుగా ఉండి లోపల కుళ్ళిపోతున్నాము అనుకోండి దాని వలన ప్రయోజనం ఏముంది? మనుషులు అలా ఉంటే ఎలాగ? శీతాకాలం గులాబీపువ్వులు ఎలా ఉంటాయో మనం అలాగ ఉండాలి అంతేగాని వేసవికాలంలో గులాబి పువ్వులు ఎలా ఉంటాయో అలాగ ఉండకూడదు. మీరు భగవద్గీతను ఎంజాయ్‌చెయ్యండి. అయితే మీ అంతట మీరు చదువుకుంటే అందులో రుచి తెలియదు. ఎవరైనా చెపుతూ ఉంటే శ్రవణం చేయటం వలన మీకు రుచి తెలుస్తుంది.

భగవద్గీతను, విష్ణుసహస్రనామాలను విడిచిపెట్టకండి అని ఆచార్యులవారుచెప్పారు. శ్రీపతి రూపాన్ని ధ్యానించుకోండి, మీకు కలిగి ఉంటే ఎవరైనాలేనివారికి నాలుగు రూపాయలు పెట్టుకోండి, భగవద్గీతను శ్రవణం చేయండి, విష్ణుసహస్రనామాలు పారాయణం చేసుకోండి మీరు తరిస్తారు అని భజగోవింద శ్లోకాలలో ఆచార్యులవారు చెప్పారు. ఈ ప్రపంచాన్ని చూసి మోహపడకండి. ఎలుకలు పడటంకోసం బోనులు ఎలా పెడతారో అలాగే ఈ జీవకోటి ఏదో ఆకర్షణలో పడటానికి భగవంతుడు ఈ లోకంలో అనేక ఆకర్షణలు పెట్టాడు. అంటే ఈ లోకంలో ఉన్న ఆకర్షణలు మీకు బోనులు. మీరు శ్రీపతిరూపాన్ని ధ్యానం చేసుకొంటే ఆ బోనుల్లో పడకుండా మీరు రక్షింపబడతారు.

## వందే శంకరాచార్యం!

సుమారు 1200 సంవత్సరముల క్రితము, కేరళ రాష్ట్రంలో పూర్ణానదీతీరాన కాలడి గ్రామంలో, వైశాఖ శుద్ధ పంచమి రోజున, ఆర్యాంబ శివగురువు అను పుణ్యదంపతులకు వరప్రసాదంగా ఒక దేహాన్ని ధరించిన ఆదిశంకరాచార్యులు, 32 సంవత్సరములు భూమిపై సంచరించారు. జీవకోటిని కల్పిత అజ్ఞానము నుండి విముక్తులను చెయ్యడానికి పరమశివుడే గురురూపంలో ఆదిశంకరాచార్యునిగా భూమిపై అవతరించాడు. గురువైన గోవిందభగవత్పాదులు శంకరునికి సారభూతమైన నాలుగు మహావాక్యాలను ఉపదేశించారు. అద్వైతజ్ఞానం ఆయన సొత్తు. జ్ఞాన భాస్కరుడైన శంకరుడు కాలినడకన దేశమంతా తిరిగి, జ్ఞానబోధ చేసి, భారతదేశము నాలుగు దిక్కులలో, నాలుగు ప్రధాన మఠములు స్థాపించారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతకు భాష్యాలు మరియు ఇతర భాష్యాలు, స్తోత్రగ్రంథాలు కారికలు, రచించారు. జ్ఞానప్రాప్తి విషయంలో శంకర గ్రంథాలలో 'వివేకచూడామణి' అమూల్యమైనది. అందు శాశ్వతదుఃఖ నివృత్తికి అద్వైతానుభవమే తరుణోపాయంగా సూచించారు. వ్యవహారిక దశలో జగత్తు నిజంలా కనిపించినా అది మిధ్యేనని, తత్త్వజ్ఞానం కలగగానే జగజ్జీవేశ్వర భిన్న భ్రాంతి నశిస్తుందని, ఆధారసత్యమునకు ఆరోపింపబడినవాటికి వస్తుతత్వంలో భేదంలేదని, శంకరులు తన బ్రహ్మానుభూతిని, ప్రపంచానుభూతిని, పాండిత్యాన్ని రంగరించి మనకు బోధచేసారు. వారి రచనలలో బ్రహ్మము యొక్క సత్యత్వం గురించి, జీవాత్మ పరమాత్మల అభేదత్వం గురించి, బంధమోక్షముల గురించి సవివరంగా తెలియజేసారు. కేవలం 32 సంవత్సరములు మాత్రమే ఈ భూమిపై సంచరించినా, మానవాళికి శ్రీ ఆదిశంకరాచార్యులు అందించిన తత్త్వబోధ అసమాన్యం. అందువల్లనే పరమగురువుగా, పరమపూజ్యునిగా శంకరులు పూజలందుకొంటున్నారు.

**(ది. 15-05-2013 శంకర జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి,** అమలాపురం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# ఆత్మ నీరాజనం

పుత్రకామేష్టియాగమున కలిగె - శ్రీరామచంద్రమూర్తి

భూపతిరాజవంశమున - రాజాయమ్మనోములపంటగా

శ్రీనాన్న గురువర్యులను - పుడమి తల్లికి

శ్రీరమణ మానసపుత్రునిగా - ప్రసాదించిన పూత చరిత ఆమె

సమత, మమతలతో బిడ్డలను - శుద్ధాతిశిద్ధులుగా తీర్చిదిద్ది

శ్రీరమణవాణిన తనదైన వైఖరీ వాణిగా

తన బిడ్డను లోకానికి అర్పించి

"జిన్నూరు వాసం - శిరసానమామి

శ్రీనాన్నదేవం - మనసాస్మరామి"

అని భక్తుల హృదయ సదనాలలో

సద్గురుదేవ సద్గురుదేవ పాహిమాం; నాన్నగారు నాన్నగారు

రక్షమాం అనిపించే ఆ దేవతామూర్తికి

ఇదియే మా హార్థిక పూజాసుమమాల

ఆమె ఆత్మశాంతికిదియె - మా నీరాజనములు

**ఇట్లు**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు**

# జీవితం గురించి ఆలోచించకు - దాన్ని అన్వేషించు

నా జీవితం ఎలా గడుస్తుందో అని ఆలోచించకూడదు. జీవితకాలాన్ని ఎంత సద్వినియోగం చేసుకొంటున్నాను అని అన్వేషించుకోవాలి. లోకచింతన వద్దు ఆత్మచింతన చెయ్యాలి. గులాబీ పొదల వద్ద ఉంటే వాటి సౌరభాలను వర్ణించకు, ఆ అందం కొద్ది సేపటికే వాడిపోతుంది, వాటి ప్రక్కనే ముళ్ళుకూడా ఉంటాయి అని గుర్తుంచుకోవాలి. అలాగే జన్మించటం దుఃఖం, పెరగటం దుఃఖం, గృహస్తుకావటం దుఃఖం, వృద్ధాప్యంలో రోగాలు రావటం దుఃఖం, మృత్యువు దుఃఖం. జీవితంలో సుఖం లభిస్తే క్షణభంగురం. దుఃఖం లభిస్తే హృదయానికి హత్తుకోవాలి. ఎప్పుడూ జీవితం ఆవలి తీరాన్ని అన్వేషించాలి. ఈ జీవితాన్ని నెమరు వేయటం కాదు. జీవించినంతకాలం జీవితం ఉంటుంది. మరణించిన తరువాత సాధనలేదు. సోక్రటీస్‌కు విషం త్రాగించి మరణదండన విధించే సమయంలో "చావు ఎలా ఉంటుందో చూడాలని ఉంది" అన్నారు. కారణం చావులేని ఆవలితీరాన్ని చేరుకొన్నాడు కాబట్టి. ఆ తీరం శాంతి, సుఖం, ఆనందం యవ్వనకాంతులతో జీవించాలంటే జీవితాన్ని ముఖాముఖి ఎదుర్కోవాలి. సంఘర్షణ అనేది సత్యం కోసం, సౌందర్యంకోసం, శ్రేష్ఠత్వం కోసం, శాశ్వత శాంతికోసం, పరమాత్మ కోసం, కాని ప్రకృతి విషయాలకోసం కాదు. ఎలా జీవించాలో దాన్ని అన్వేషించి అలా జీవిస్తే కృతార్థులమౌతాము. జీవితంలో అజ్ఞానంపై పోరాటం సాగుతూ ఉంటే లోన దాగిఉన్న ఆత్మ ప్రకాశించి ప్రకటితమౌతుంది. వివేకవైరాగ్యాలతో దుఃఖాలను ప్రశాంతంగా అనుభవించినప్పుడే మనిషి పూర్ణ అర్థంలో జీవించినవాడు అవుతాడు. సాహసాలు చెయ్యటంలో ప్రమాదాలను ఎదుర్కోవటంలో బుద్ధుడు సమర్థుడైనప్పుడే నిర్వాణసుఖం చేతికి అందింది. భయజీవితాలలో అసలు ఎవ్వరూ ధార్మికుడు కాలేడు. మనం భయాన్ని సృష్టించుకొంటే మనకు తిరిగి భయమే ప్రాప్తిస్తుంది. క్షణంక్రితం మిత్రుడు క్షణం తరువాత శత్రువు, మిత్రుడుగానే ఉంటాడనే నమ్మకం లేదు. క్రితం ఆర్థిక వ్యవస్థ అద్భుతం అది క్షణికం. సంపద అంతా పోవచ్చు. కష్టాలు రావచ్చు. కాని మనం సినిమాతెరలా ఉండాలి (ఆ తెరను నీరు, అగ్ని ఏమీ చెయ్యదు). అప్పుడే మనం భయరహితులమౌతాము. ప్రకృతిగుంపు ఎప్పుడూ సాంప్రదాయబద్ధంగానే ఉంటుంది. మనకు హితోపదేశాలు చేస్తుంది. అవి వినకూడదు. బోధకై వెళుతున్న ఒక భిక్షకునితో బుద్ధుడు "ఎవరైనా నిన్ను దూషిస్తే ఏమి చేస్తావు? అనగా అందుకు అయన "కొట్టలేదు అనుకుంటాను. కొడితే? చంపలేదు అనుకుంటాను. చంపితే? ఈ జీవితానికి విముక్తి లభించింది అని ధన్యవాదాలు తెలుపుతాను" అన్నాడు. శ్రీ నాన్నగారు 'అంతా నిర్ణయమైపోయింది అనేది నీ దేహప్రారబ్ధానికీ నీవు ఆత్మవు' అన్నారు. మనిషికి స్వంత ఆలోచన రావటంలేదు. వివేకమనే బీజం రావాలంటే దానికి గురు అనుగ్రహమనే అమృతంలో నానబెట్టి, మొలకను గురురక్షణ వలయంలో ఉన్నప్పుడే చెట్టు అయి ఫలాలతో అలరారుతుంది. మనం లోకుల కళ్ళతో చూస్తున్నాము. మనలో ముళ్ళవంటి రోగాలు ఎన్ని ఉన్నాయో తెలియటంలేదు. జీవితాన్ని వ్యర్థంగా గడపక జీవిత రహస్యాలను గుర్తించి పరివర్తన చెందినవాడు ధన్యుడు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**